## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 24 : కూకట్‌పల్లి ( కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు ( కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 15, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 28, కాలీఫ్లవర్ 23, దొండ 15, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 45, ఆలుగడ్డ 24, కీర 23, దోసకాయ 15, సోరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 60, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 18, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9 :30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి, మే 24 : తలకు తీవ్ర గాయమై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గంనకు చెందిన ఏండ్ల రవికుమార్ (28) ఓ ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్‌బాయ్. ఈ నెల 22 న ఉదయం 6:30 గంటల ప్రాంతంలో లింగంపల్లి నుంచి రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనం (టీఎస్ 07 ఎఫ్ఎం 5715) పై వస్తున్నాడు. గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం రవికుమార్‌ను ఢీ కొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో కొండాపూర్ జిల్లా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యసేవలు అందిస్తున్నారు. రెండు రోజులుగా కోమాలో ఉన్న రవికుమార్ శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మే 24 : మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అధ్యక్షతన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికే పలుమార్లు ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని, ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సూచించారు. అదే సమయంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సకాలంలో పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ తాసిల్దార్, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, విద్యాశాఖ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలు పెంచాలి



ఉపాధ్యాయుల శిక్షణ తరగతులలో పాల్గొని మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 24 : ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యా ప్రమాణాల పెంపునకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలతో పాటు 132 – జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా ఐదురోజులుగా నిర్వహిస్తున్న ' వృత్యాంతర శిక్షణ ' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, అర్హతగల ఉపాధ్యాయులు ఉంటారని వాటిని వినియోగించుకొని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విషయ, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో దుండిగల్ మండల విద్యాధికారి కృష్ణ, మండల రిసోర్స్ పర్సన్ రమేశ్, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిని కుమారి, మండల రిసోర్స్ పర్సన్ రమేశ్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజలు

దుండిగల్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో సమస్యలను వివరించడంతోపాటు పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కృష్ణ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మియాపూర్ : తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో జరిగే 25 వసంతాల మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన గోడపత్రికను టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ వద్ద ఆవిష్కరించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్, టీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోహిరు నాగరాజు , సీనియర్ జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలను ఏకతాటి పైకి తీసుకొచ్చి స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో కీలక భూమిక పోషించిందన్నారు. టీజేఎఫ్ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో జరిగే వేడుకలను విజయవంతం చేయాలని జర్నలిస్టు మిత్రులందరికీ పిలుపునిచ్చారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ టీయూడబ్ల్యూజే నాయకులు వి.భాస్కరాచారి, కైలాస్ నేత, జాషువా, ఆనంద్ రావు, తేళ్ల హరికృష్ణ, దాదే వెంకట్, బొమ్మ గోపి లక్ష్మణ్ గౌడ్, హరికుమార్ చౌదరి, షబ్బీర్, కుల్లరాజు, శ్రీనివాస్ రెడ్డి, హరి, చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



## వీనుల విందుగా స్వరార్చన

మాదాపూర్, మే 24 : శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామి సంకీర్తనలతో కళాకారులు అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భవన వాహిని సంస్థలో డా. శోభారాజు ఆధ్వర్యంలో అన్నమయ్య స్వరార్చన నిర్వహించారు. డా.శోభారాజు వద్ద సంకీర్తనలు నేర్చుకున్న విద్యార్థిని కుమారి శ్రద్ధ యలమర్తి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి అలరించింది. శ్రీనివాస్ కీ బోర్డు, అజయ్ తబలా సహకారం అందించారు. కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్, శోభారాజు జ్ఞాపికలతో సన్మానించారు.



## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

కొండాపూర్, మే 24 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ వినీలరావు శిష్య బృందం రుత్విజ, శాన్వి, వివేకా, సమ్రితి, ఆరాధ్య, సిరి చందాన, గౌతమి, శిరీష, రితిక, విశీతా, సింధు, సాయి సరయు, వైష్ణవి, చరిత కృష్ణ, స్రవంతి, దివ్య, గాయత్రి ప్రదర్శించారు. కార్యక్రమానికి గౌరీ శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

కేపీహెచ్‌బీ కాలనీ : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దశమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం సింహవాహన సేవ, ఊరేగింపు పూజలు జరిగాయి. నేడు (ఆదివారం) మోహిని అలంకరణలో పల్లకీ ఉత్సవం, ఊరేగింపు, సాయంత్రం గరుడ వాహన సేవ, ఊరేగింపు ఉత్సవాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



## మెరుగైన సదుపాయాలు కల్పిస్తా ..

బాలానగర్ : ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం చరబండ రాజునగర్‌లో మాలజంగం కులస్తుల శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశ, నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, పంజా రామచందర్ ముదిరాజ్, ఎన్వీ రత్నం, ప్రేమ్ కుమార్, సంద్ర సునీల్‌కుమార్, సాగర్, యాదగిరి, అమర్నాథ్, యోగేశ్, వీరేశం, సోమనాథ్, బసవరాజ్ పాల్గొన్నారు.



మాలజంగాల శ్మశానవాటికలో పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి



## సొసైటీ అభివృద్ధికి కృషి

అల్లాపూర్, మే 24 : మోతీ నగర్ కో–ఆపరేటివ్ సొసైటీ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తామని డెవలప్‌మెంట్ కమిటీ ఎన్నికల అభ్యర్థులు అన్నారు. శనివారం మోతీనగర్ పరిధిలోని శ్రీ శివ రామాంజనేయ ఆలయంలో తమ ప్యానెల్ కు సంబంధించిన మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈసారి తమ ప్యానెల్‌కు అవకాశం ఇస్తే.. మోతి నగర్ కో– ఆపరేటివ్ సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు.

## ఆలయంలో బోరు పనులు ప్రారంభం



మియాపూర్, మే 24 : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్ – 2 భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో నూతన బోరు నిర్మాణ పనులకు బీఆర్ఎస్ నాయకుడు సతీశ్ శనివారం శంకుస్థాపన చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఎం. కృష్ణారావు తోడ్పాటుతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, సమ్మా రెడ్డి, గోపాల్ రెడ్డి, సాంబమూర్తి, ఎండీ ఇస్మాయిల్, సాయి గౌడ్, తేజ, శ్రీను పాల్గొన్నారు

## పశువుల వధను అడ్డుకోవాలి

రవీంద్రభారతి, మే 24 : బక్రీద్ సందర్భంగా జంతువుల వధను అడ్డుకోవాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో సెక్రటరి మహేష్‌అగర్వాల్, జాయింట్ సెక్రటరి రితేష్ జాగిర్దర్, ఉపాధ్యక్షుడు జస్వత్ పటేల్ లతో కలిసి అధ్యక్షుడు జస్రాజ్ శ్రీశ్రీమాల్ మాట్లాడుతూ.. నగరానికి పశువులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. పండుగను పురస్కరించుకొని నగరంలో 10వేల పశువుల వధ జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. రాతపూర్వకంగా పర్మిషన్ ఉన్న పశువులు మాత్రమే తేవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పశువులను రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అడ్డుకోవాలన్నారు. గూడ్స్ క్యారియర్‌లో వస్తున్న పశువులను అడ్డుకోవాలన్నారు. నగరంలో చుట్టుపక్కల 200 స్లాటర్ హౌసెస్ ఉన్నట్లు వెల్లడించారు.

## ఓయూలో బ్యాక్‌లాగ్స్ విద్యార్థులకు వన్ టైం అవకాశం

సికింద్రాబాద్ : ఓయూలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ చదివి బ్యాక్ లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్ టైం అవకాశం ఇస్తూ పరీక్షల విభాగం నిర్ణయం తీసుకుంది. 2000 – 15 మధ్య చదివిన వారికి ఈ అవకాశం వర్తిస్తుందని కంట్రోలర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇయర్ వైస్ స్కీమ్ కింద 2000– 15 మధ్య చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు .. తిరిగి పరీక్షలు రాసేందుకు అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశిత రుసుం చెల్లించి జూలైలో జరిగే పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. విద్యార్థులు చదివిన కాలం చివరి సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. బ్యాక్ లాగ్ పరీక్షలు రాసే విద్యార్థులు జూన్ 19 వరకు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చు. 500 ఆలస్య రుసుంతో జూన్ 20 నుంచి 24 వరకు చెల్లించవచ్చు. ఆయా కళాశాలల నుంచి వచ్చే ఫీజులు కళాశాలల ద్వారా జూన్ 25 సాయంత్రం 5 గంటల వరకు ఓయూ పరీక్షల విభాగానికి ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని కంట్రోలర్ కార్యాలయం స్పష్టం చేసింది. వివరాలకు www.osmania.ac.in లో చూడవచ్చు.

# పనులు సకాలంలో పూర్తి చేయండి



కేపీహెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు



పర్వత్‌నగర్‌లో తాగునీటి పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహ బేగం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 24 : వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అసంపూర్తి పనులు సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా గతంలో చేపట్టిన పనులను పూర్తిచేయాలని కోరారు. రోడ్డు, డ్రైనేజీ, వీధి దీపాలు సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ం డివిజన్‌లో జరుగుతున్న ఎస్టీపీ ప్లాంట్ పైపులైన్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈలు రంజిత్, వర్షిని, ఎంటామాలజీ ఏఈ సోని, సూపర్‌వైజర్ మహేందర్ రెడ్డి, ఎస్ఎస్ జమీల్, ఎస్ఆర్పీ శ్రీనివాస్, యూబీడీ సమత, విజయశ్రీ, పుల్లారావు, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అల్లాపూర్ : పర్వత్‌నగర్‌లో తాగునీరు సరిగా రావడం లేదని మహిళలు వార్డు కార్యాలయంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబిహబేగంనకు తమగోడును వెళ్లబుచ్చారు. లో ప్రెషర్‌తో 30 నిమిషాలు మాత్రమే వస్తున్నాయని వాపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంటకుపైగా సరఫరా అయ్యేదన్నారు. శనివారం పర్వత్‌నగర్‌లో జలమండలి అధికారులతో కార్పొరేటర్ పైపులైన్లను పరిశీలించారు. తాగునీరు సకాలంలో సరిపడా అందించాలని కార్పొరేటర్ ఆదేశించారు.

## పచ్చిరొట్ట ఎరువులు వాడాలి

**మేడ్చల్ రూరల్ :** ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మేడ్చల్ మండలంలోని బండమాదారం, ఎల్లంపేట, ఘన్‌పూర్ గ్రామాలతో పాటు గుండ్లపోచపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైతులు సకాలంలో దుక్కులు దున్నుకొని భూసారం పెంచుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మోతాదుకు మించి ఎరువులను, క్రిమి సంహారక మందులను ఉపయోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం శాస్తవేత్తలు వసంత, పుష్పవల్లి, స్వర్ణలత, వరప్రసాద్, వ్యవసాయ అధికారి అర్చన, విస్తరణ అధికారులు సుమిత, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

**శామీర్‌పేట/ కీసర :** మండల రైతాంగానికి ప్రాథమిక సహకార సంఘం నుంచి పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నామని కీసర, ఏవో మాధవిలత ,శామీర్‌పేట వ్యవసాయ అధికారి రమేశ్ తెలిపారు. జీలుగ, జనుములు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, జీలుగ, జనుము 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. జీలుగ 30 కిలోల బ్యాగ్ రూ. 2137.50, జనుము 40 కిలోల బ్యాగ్ రూ. 2510 జీలుగ, జనుము 1 హెక్టార్‌కు 2.20 ఎకరాలకు 1 బ్యాగ్ చొప్పున వాడాలని సూచించారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకుని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

## ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలి



మూడుచింతలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి.

**శామీర్‌పేట, మే 24:** అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సూచించారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, కేశవరంలో ధాన్య కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టరు పరిశీలించారు. ముందుగా రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని, ధాన్యాన్ని రైస్ మిల్లులకు త్వరగా పంపిచాలని సూచించారు. ఓపీఎంఎస్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెంటనే అదనపు వాహనాలను అందించాలని వరి రవాణా కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై శాఖ డీఎం సుగుణ బాయి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందిస్తాం



సూపరింటెండెంట్ విజయకుమారి

చార్మినార్ : ప్రభుత్వం పేదల వైద్యం కోసం అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తుందని పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. విజయకుమారి అన్నారు. శనివారం సూపరింటెం డెంట్‌గా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రజిని రెడ్డి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నిలోఫర్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న టి. విజయకుమారి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోనే అతి పెద్దదైన ఈ ఆసుపత్రిలో గర్భిణులు ప్రతిరోజూ వందలాదిమంది వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గం టలు డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అం దించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది సైతం రోగులను ఇబ్బంది పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. రోగులు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని ఆమె తెలిపారు.

## గురుకుల్‌కు పూర్వ వైభవం కల్పించాలి

ఘట్‌కేసర్, మే 24: ఘట్‌కేసర్‌లోని శిథిలావస్థకు చేరుకున్న గురుకుల్ విద్యాలయానికి పూర్వవైభవం కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉత్తరాల ఉద్యమం 69వ రోజుకు చేరుకుంది.పూర్వవైభవం కోసం మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఉత్తరాలను సీఎంకు పోస్టు చేయాలని కోరుతూ పూర్వ విద్యార్థులు ఇం టింటికీ ప్రచారం చేస్తూ ఉత్తరాలను అందజేస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చి చర్యలు తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.